




అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి

పశుగణనలో బోగస్ లెక్కలున్నాయా..?

- వివరాలు వెల్లడించలేని పశుసంవర్ధక శాఖ
- క్షేత్ర స్థాయిలో తగ్గిన పశుపోషణ - అంకెల గారడి చేశారని ఆరోపణలు



ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఐదేళ్ళకోసారి జాతీయ స్థాయిలో పశుగణన చేపడతారు. మొదట 1919-20లో జరిగింది. ప్రస్తుతం 21వ అఖిల భారత పశుగణన చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశేషమైన ప్రాధాన్యత ఉంది. గ్రామస్థాయి నుంచి దేశం వరకు నల్ల, తెల్ల జాతి పశువులు, పందులు, గాడిదలు, ఒంటెలు, కుందేళ్ళు, కోళ్ళు తదితర వాటి సంఖ్య ఎంత ఉందనేది పక్కాగా తేలుతుంది. జాతీయ స్థాయిలో పశువుల సంఖ్యను బట్టి టీకాల తయారీతో పాటు పశు సంపద సంరక్షణకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అయితే పశుగణనలో పారదర్శకత లోపించిందనే విమర్శలున్నాయి. లేని పశువులను నమోదు చేశారని అందుకే నేటికి వివరాలు వెల్లడించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతస్థాయి నుంచి కింది స్థాయి వరకు లేని పశు వులను నమోదు చేసేవిధంగా ప్రోత్సహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశుసంవర్ధక శాఖలో లైవ్‌స్టాక్ లెక్కలన్నీ అంకెల గారిడీనేనని డిపార్టుమెంటు సిబ్బందే చెబుతుండటం గమనార్హం. 10-15 ఏళ్లగా పశుసంపద భారీగా తగ్గుతోంది. ఒకప్పుడు వ్యవసాయానికి పశువులే ఆధారం. సాంకేతికత అభివృద్ధి చెందడంతో వాటి వినియోగం 75 శాతం తగ్గిపోయింది. ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలు వినియోగిస్తున్నారు. గ్రామాల్లో పాడిపశువులు తగ్గిపోయాయి. రెండు దశాబ్దాల క్రితం ఒక గ్రామంలో రెండు వేల పశువులు ఉంటే నేడు 500కు మించి ఉండటం కూడా గగనమే. గతంలో పాడికి నిలయంగా ఉండే గ్రామాల్లో కూడా 85 శాతం వరకు ప్యాకెట్ పాలే వాడుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఆవుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కానీ పశుగణనలో మాత్రం పశుసంపద అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. 18వ పశుగణన ప్రకారం అమ్మడి జిల్లాలో గేదె జాతి పశువులు 1.20,416 ఉన్నాయి. 20వ పశుగణనలో గేదె జాతి పశువులు 1,26,781 ఉన్నాయి. గ్రామాల్లో పశువులేకనిపించని పరిస్థితి ఉంటే 8.388 నేదె జాతి పశువులు పెరిగినట్లు చూపారు. అన్ని రకాల పశువుల్లో ఇదే తరహా లెక్కలు ఉంటున్నాయి. పశుగణనకు ముందు తెల్లజాతి (ఆవులు, ఎద్దులు, దూడలు) 2,35,586, గేదె జాతి (నల్లజాతి) పశువులు 1,26,784, గొర్రెలు 11,03,043 ,మేకలు 3,04,744,కోళ్లు 5,84,911 గా లెక్కలు చూపారు కానీ క్షేత్ర స్థాయిలో ఇవి కూడా లేవనేది అందరికి తెలిసిన వాస్తవమని పాడి రైతులు తెలుపుతున్నారు. పశువులు పశుగణనను పక్కాగా నిర్వహిస్తేనే ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

21వ పశుగణనలో కూడా అంకెల గారడీ..

జాతీయ స్థాయిలో గతేడాది అక్టోబరు నెల చివరి వారంలో 21వ అఖిల భారత పశుగణన మొదలైంది. కానీ నేటికీ కూడా అధికారిక లెక్కలు రాష్ట్ర స్థాయిలో జాతీయ స్థాయిలో వివరించలేదు. జిల్లాలో పశుసంవర్ధక శాఖ అధికారులను లెక్కలు అడిగితే వివరాలు వెల్లడించడానికి మొహం చాటేస్తున్నారు. నిబంధనల ప్రకారం చెప్పడానికి వీలు లేదని తదుపరి తెలుపుతామని దాటేస్తున్నారు. దీనిని బట్టి పశుగణన ఒట్టి బోగస్ అనేది తేటతెల్లమైందని పశుపోషకులు తెలుపుతున్నారు.

వాస్తవాలను నమోదు చేశారు



రీవేరిఫికేషన్ పూర్తి అయింది. సెంట్రల్ టీం వేరిఫికేషన్ చేశారు.25 శాతం పశుపోషణ పెరిగిందని అంచనా .వాస్తవాలు పశుపోషణ వివరాలు నమోదు చేశారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం.

- డాక్టర్ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ జెడి.

నగర అభివృద్ధికి కృషి : మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 45వ వార్డు అశోక్ నగర్‌లో పలు కాలనీలకు చెందిన అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజచేశారు. పైలాన్ లను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.75.70 లక్షలు వెచ్చించి శ్రీనగర్ (రూ.49 లక్షలు), అశోక్ నగర్(రూ.17 లక్షలు)లలో మురుగు నీటి కాలువలు అభివృద్ధి చేయడానికి , శ్రీకృష్ణ కాలనీ(రూ9.70 లక్షలు)లో రోడ్డు ఎత్తు పెంచడానికి ఈ నిధులు వినియోగించడానికి అనుమతులు ఇచ్చామని మంత్రి తెలిపారు. కాంట్రాక్టర్‌ను మూడు నెలల లోపల తీసుకున్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు మురళి, ప్రసాద్ తదితరులు స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొని రాగా సమస్యలన్నీ తీర్చడానికి నగర అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ శేష సాయి, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, 45వ వార్డు కార్పొరేటర్ మాణిక్యమ్మ, ప్రసాద్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక కమిషనర్‌గా పి.విశ్వనాథ బాధ్యతలు



ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా పి.విశ్వనాథ శుక్రవారం శుక్రవారం నగరపాలక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, రహదారుల విస్తరణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, అన్యాక్రాంతమైన పార్కు స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాలన సాగిస్తామన్నారు. అనంతరం కమిషనర్‌కు అదనపు కమిషనర్ ఆర్జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పేద కుటుంబాలకు పి4 ఆసరా

- బోయ కౌలుట్లయ్య కి రూ.2 లక్షల సాయం
- మార్గదర్శిగా నిలిచిన డాక్టర్ సుధాకర్ రావు : కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలను ఆదుకోవడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ - మార్గదర్శి - బంగారు కుటుంబం కింద గోనెగండ్ల రైతు బోయ కౌలుట్లయ్య కుటుంబానికి కలెక్టర్ రూ.2 లక్షల చెక్కును అందచేశారు. ఫౌండేషన్ ద్వారా మార్గదర్శిగా సుశీల నేత్రాలయ అధినేత డాక్టర్ సుధాకర్‌రావు ముందుకు వచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదల బతుకుల్లో వెలుగు నింపేలా స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గోనెగండ్లకు చెందిన బోయ కౌలుట్లయ్య పేదరికం వల్ల ఇబ్బందులు పడుతుండడంతో బంగారు కుటుంబంగా గుర్తించి మార్గదర్శిగా ముందుకు వచ్చిన సుశీల నేత్రాలయ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుధాకర్‌రావు ద్వారా ఆర్థిక సహాయం చేశారు. రూ. 2 లక్షల డబ్బుతోపాడి గేదెలను కొనుగోలు చేసి జీవన ఉపాధి కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.



రైతు కుటుంబానికి డాక్టర్ సుధాకర్ ఇచ్చిన రూ. 2 లక్షలు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

- 14న విద్యుత్ ఎస్ఇ కార్యాలయం ఎదుట ధర్నా
- స్మార్ట్ మీటర్ మాకొద్దంటూ వ్యక్తిగత అర్జీలతో ప్రజలు పాల్గొనాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం అండతో అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం కర్నూలు నగరం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కవాడి వీధి, చాకలిగేరీ, కడక్ పుర, ఎర్రబురుజు ప్రాంతాలలో, సిపిఎం న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో, 33వ వార్డు కల్లూరులో గురువారం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ స్మార్ట్ మీటర్ల నష్టాన్ని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బళ్లారి చౌరస్తాలో ఉన్న విద్యుత్ సౌదా ఎస్సీ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రజలందరూ మాకొద్దు స్మార్ట్ మీటర్ అంటూ వ్యక్తిగత అర్జీ తీసుకొని పాల్గొని నిరసన తెలపాలని, ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె, బైరాపురం గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 14న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.

కవాడి వీధి, చాకలిగేరీ, కడక్ పుర ప్రాంతాల్లో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన ప్రచార కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ సర్దుబాటు చార్జీలు పెంచుతూ ప్రజలపై భారం వేస్తుందన్నారు. అదానీ కంపెనీకి లాభాలు చేకూర్చే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి అధికారులు వస్తే అందరూ ఏకమై ముక్తకంఠంతో వ్యతిరేకించి అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు జయమ్మ, నాగస్వాములు, ఈశ్వర్, గోరే, మూస తదితరులు పాల్గొన్నారు. **11వ వార్డులో..** విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 14న బళ్లారి చౌరస్తా దగ్గర గల విద్యుత్ సౌదా ముందు ధర్నాను చేయతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎం డి షరీఫ్, నగర నాయకులు షేక్ మహబూబ్‌బాష కోరారు. 11వ వార్డు ఎర్ర బురుజులో ఎర్ర శ్రీనివాసులు నాయకత్వంలో వీధులలో ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో నాగ రాజు,రాజేంద్ర బాబు, వెంకటేశ్వర్లు, కుమార్, మద్దిలేటి ,ప్రకాష్, మణి, కుమార్ ,ఎల్లప్ప, పరశురామ్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్ : కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో స్మార్ట్ మీటర్లపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా సిపిఎం నాయకులు కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ స్మార్ట్ మీటర్ పెట్టడం వలన పడే భారాలపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు. ఐద్వా జిల్లా కార్యదర్శి యస్. అలివేలమ్మ, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కే.ప్రభాకర్ మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బళ్లారి చౌరస్తాలో ఉన్న విద్యుత్ సౌదా ఎస్సీ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రజలందరూ మాకొద్దు స్మార్ట్ మీటర్ అని వ్యక్తిగత అర్జీ తీసుకొని పాల్గొని నిరసన తెలపాలని, ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎం. భాస్కర్. జమ్మన్న, రహిమాన్, జాని, హుస్సేన్ వలి, గుర్రప్ప, అబ్దుల్లా, ఆర్. మద్దిలేటి. అనసూయమ్మ ,రేవతి స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

33వ వార్డులో : 33వ వార్డు కల్లూరులో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ స్మార్ట్ మీటర్ల నష్టాన్ని వివరిస్తూ సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప, కల్లూరుకార్యదర్శి జె శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మన్న సుంకన్న చిన్న రమేష్ పెద్ద రమేష్ వెంకటేష్ కుమార్ కృష్ణ తదితరులు హాజరయ్యారు.

ఓర్వకల్లు మండలంలో..

కర్నూలు కలెక్టరేట్ : ఓర్వకల్లు మండలంలోని లొద్దిపల్లె బైరాపురం గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి బి నాగన్న మాట్లాడుతూ ఈ నెల 14న ఓర్వకల్లు కరెంటు ఆఫీస్ ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు మాసుంభాష, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామస్వామి, నాగరాజు, డప్పు కళాకారుల సంఘం నాయకులు కృష్ణుడు, మద్దిలేటి, నారాయణ పాల్గొన్నారు..



మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్



వీకర్ సెక్షన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, ఐద్వా నాయకులు

మా నిధులు మాకు ఇవ్వండి..

- వైద్య సిబ్బందిపై సూపరింటెండెంట్ చిందులు..

ప్రజాశక్తి-పత్తికొండ...



మాట్లాడుతున్న ల్యాబ్ టెక్నీషియన్స్

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవా ట్రస్ట్ వైద్య సేవలో వైద్యులకు, ఆస్పత్రి సిబ్బందికి మా నిధులు మాకు ఇవ్వండి అంటూ ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ జి.సురేష్, కౌన్సిలర్ కర్రెప్ప ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అనుబంధ ఐసిటిసి కార్యాలయంలో మీడియాతో ల్యాబ్ టెక్నీషియన్ జి.సురేష్, కౌన్సిలర్ కర్రెప్ప మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఆసుపత్రిలోని వివిధ రకాల రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేషెంట్ కి వైద్య పరీక్షలు చేసిన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కొంతమేరకు నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు , ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసిటిసి సిబ్బందికి ఆరోగ్యశ్రీ నిధులు చెల్లిస్తున్నారని పలుమార్లు పత్తికొండ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం లిఖితపూర్వకంగా అర్జీ ఇవ్వడానికి వెళ్తే సూపరింటెండెంట్ మాపై చిందులేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి నాకు సంబంధం లేదంటూ భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ సేవ ట్రస్ట్ పై సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై సూపరింటెండెంట్ కల్పన వివరణ ఇవ్వగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఆరోగ్యశ్రీ నిధులు చెల్లింపు. ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ అభివృద్ధి చేశాం. ఐసిటిసి సిబ్బందికి ఆరోగ్య శ్రీ నిధులకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లాలో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ వారి వాహనాలకే కాక పక్కవారి వాహనాలకు సైతం ప్రమాదాలు తెచ్చిపెడుతున్న మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వారు ద్విచక్ర వాహనాలు, ఇతర రకాల వాహనాలు నడిపినట్లు గుర్తిస్తే వాహన యజమానులు, వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. మితిమీరిన వేగంతో, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, సైలెన్సర్లు తీసి ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేసి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించినా చర్యలు తప్పవన్నారు.

నేడు 'విద్యారంగం - వైజ్ఞానిక దృక్పథం' సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు సుందరయ్య విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో ఎస్‌వి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న బిఎస్ కల్యాణ మండపంలో శనివారం 'విద్యారంగం - వైజ్ఞానిక దృక్పథం సదస్సు' నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా డాక్టర్ దేవరాజు మహారాజు, విజ్ఞాన చింతన పరిశోధకులు వస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతాం

- స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ కె. పట్టాభిరాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలును చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఆయన కర్నూలు కార్పొరేషన్‌కు వచ్చిన సందర్భంగా కమిషనర్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలోని చెత్త సేకరణ ప్రాసెసింగ్, వేస్ట్ మేనేజ్మెంట్ విషయాలపై రివ్యూ చేశానని చెప్పారు. జోహరాపురం, గార్గేయపురం ప్రాససింగ్ చేసే ప్రాంతాన్ని పరిశీలించాలని చెప్పారు. భవిష్యత్తులో చెత్త డంపింగ్ లేకుండా చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో మంత్రి టీజీ భరత్ సలహాలు, సూచనలు తీసుకున్నామన్నారు. కర్నూలు నగరంలో ప్రతిరోజు 200 నుండి 220 టన్నుల చెత్త వస్తుందని చెప్పారు. స్వచ్ఛ్ ఆంధ్రలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు మూడు నెలల్లో ఇంటింటి చెత్త సేకరించే 91 ఎలక్ట్రిక్ వాహనాలను టెండర్ పిలిచామని, వాటిని కర్నూలు నగరానికి అప్పజెప్తామని తెలిపారు. రెండు జిబిఎస్ స్టేషన్లను త్వరగా పూర్తిచేసి రెండు ట్రాన్సిస్టర్లను ఏర్పాటు చేసి అక్కడ ప్రాసెసింగ్ చేస్తున్నామన్నారు. త్వరలో వెహికల్ డిపోను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్కడ కాంట్రాక్టర్లు నగరపాలక సంస్థకు చెందిన వాహనాలను ఉంచేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కర్నూలు నగరానికి రెండు ప్రాజెక్టులు రానున్నాయని తెలిపారు. అందులో వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను 15 కిలోమీటర్ల యుఎల్‌బి పరిధిలో ఏర్పాటు చేసి ఏ రోజు చెత్త ఆరోజు తడి చెత్త నుండి కంపోస్టును తయారుచేసి రైతులకు అందజేస్తామన్నారు. పొడి చెత్తను జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఫ్యాక్టరీ కి అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల కంపోస్టు యార్డులను, 50 వేస్ట్ కంపోస్ట్ యార్డులలో తయారైన ఎరువును మార్కెడ్ ద్వారా అతి తక్కువ ధరకు రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యర్థాల వేస్ట్ ద్వారా ఎనర్జీ తయారు చేసి 15 మెగావాట్ల విద్యుత్తు తయారుచేసే కేంద్రం నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కర్నూలు నగరాన్ని స్వచ్ఛంద ఆధారంగా తీర్చిదిద్దేందుకు 91 ఎలక్ట్రిక్ క్లాప్ ఆటో వాహనాలను తడి పొడి చెత్త సేకరించేందుకు రెండు నెలల్లో అందిస్తామన్నారు. గతంలో పని చేసి ఉపాధి కోల్పోయినక్లాప్ డ్రైవర్లను పిలిపించి పనిచేయటానికి సుముకతగా ఉన్నటువంటి వారిని రాజకీయాలకతీతంగా గతంలో పనిచేసిన వారికి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. కర్నూలు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే మంచిర్యాంకు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. జోహారాపురం, గార్గేయపురం, నగర పరిధిలో ఎక్కడ అన్యాక్రాంతమై ఉన్న కార్పొరేషన్ స్థలాలను సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. క్లాప్ డ్రైవర్లకు పెండింగులో ఉన్న జీతాలు కూడా ఇచ్చే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగినట్లు మా దృష్టికి వచ్చిందని, అవినీతి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని చెప్పారు. విలేకరుల సమావేశంలో కమిషనర్ పి.విశ్వనాథ, అదనపు కమిషనర్ ఆర్జివి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ కె. పట్టాభిరాం

ప్రపంచ జనాభా దినోత్సవం అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిఎంహెచ్ఓ శాంతి కళ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్, డిపిఎంఒ డాక్టర్ ఉమా, డిఐఒ డాక్టర్ నాగప్రసాద్ బాబు, సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, డిపిఒ డాక్టర్ సంధ్య, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఎస్ఒ హేమసుందరం, డెమో శ్రీనివాసులు, డిపిఒ విజయరాజు, డిపిహెచ్ఎన్ఒ అన్నపూర్ణ పాల్గొన్నారు. **మద్దికెర** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ, సూర్యనారాయణ, హెల్త్ ప్రొవైడర్ అంజలి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీదేవి, రాధమ్మ, శివలలిత పాల్గొన్నారు.



మద్దికెరలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

వైద్య విద్యలో 'రిసెర్చ్'కు ప్రాధాన్యం

- ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైద్య విద్య, ప్రభుత్వ వైద్య కళాశాలల సర్వతోముఖాభివృద్ధికి శ్రీకారం చుడుతూ వైద్య విద్యలో రిసెర్చ్ కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నామని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాలను సందర్శించిన ఆయన డిజిటల్ లైబ్రరీని, ఇండోర్ గేమ్స్ హాల్‌ను అకాడమిక్ డిఎంఇ డాక్టర్ రఘునందన్‌తో కలిసి ప్రారంభించారు. వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్స్‌తో కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య విద్యార్థులు నిరంతరం వైద్య విద్యలో నూతన ఆవిష్కరణలను గమనిస్తూ ఉండాలని, డిజిటల్ లైబ్రరీని ఉపయోగించుకుని రీసెర్చ్ కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. వైద్య విద్య అన్నది కేవలం చదువుకోవడం మాత్రమే కాదని, అంకితభావంతో కూడుకున్నదని, విద్యతో పాటు ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉందని తెలిపారు. వైద్య విద్య నేర్పే గురువులకు ఎంతో బాధ్యత ఉందని, ఉత్తమ డాక్టర్లను సమాజానికి అందించాలని కోరారు. మెడికల్ కళాశాలలో స్కిల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. న్యూ లెక్చరర్ గ్యాలరీలో పీజీలు, హౌస్ సర్జన్లు, వైద్య విద్యార్థులతో వైస్ ఛాన్స్ లర్ ముచ్చటించారు. వారి సమస్యలను తెలుసుకొని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ హరి చరణ్, డాక్టర్ రేణుక దేవి, డాక్టర్ విజయ ఆనంద్ బాబు, డాక్టర్ సింధియా శుభప్రద, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

నిరక్షరాస్యతను నిర్మూలించాలి : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అక్షర ఆంధ్ర ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అక్షరాంధ్ర కార్యక్రమ నిర్వహణపై లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లా లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 15 నుండి 59 ఏళ్ల మధ్య వయస్సు గల 1,61,914 మంది నిరక్ష్యరాస్యు లను అభ్యాసకులుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశిత షెడ్యులు ప్రకారం సంబంధిత లైన్ డిపార్టు మెంట్స్ అందరు ప్రత్యేక చొరవ తీసుకొని వయోజన విద్యా శాఖ వారికి సహకారం అందించి అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలని తెలిపారు. వయోజన విద్య ఉప సంచాలకులు, కె.చంద్రశేఖర్‌రెడ్డి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

జీవితాన్ని సమతుల్యంతో మలుచుకోవాలి

రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పెరుగుతున్న జీవన ప్రమాణంలో జీవితాన్ని సమతుల్యతతో మలుచుకోవాలని రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్ల కృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ... నేటి యువత ఉన్నతంగా స్థిరపడాలని ఉద్దేశంతో పెండ్లిని వాయిదా వేస్తున్నారని, ఈ భావనతో భవిష్యత్తులో జనాభా పెరుగుదల రేటు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి అధ్యాపకులు డాక్టర్ సవితదేవి, డాక్టర్ వి.ఎం.రాజశేఖర్, డాక్టర్ ఎం. నాగ్ అరుణ్, డాక్టర్ మల్లయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై వారోత్సవాలు

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

ఈనెల 10 నుంచి 16 వరకు ఉమ్మడి జిల్లాలో మధ్యవర్తిత్వంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను ఎలా పరిష్కరించాలనే దానిపై సమీక్ష నిర్వహించారు. కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, సెక్రటరీ వెంకటేశ్వర్లు, హైకోర్టు బార్ అసోసియేషన్ మెంబర్ రవి గువేరా పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై వన్‌కె ర్యాలీ : బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరిలు మధ్యవర్తిత్వంపై వన్‌కె ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కర్నూలు న్యాయ సేవా సదన్ జిల్లా కోర్ట్ ప్రాంగణం నుంచి కొండారెడ్డి బురుజు వరకు సాగింది. శిక్షణ పొందిన మీడియేషన్ న్యాయవాదులు నాగశేషయ్య, యువి.లక్ష్మి, ఎస్సీ ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.శ్రీహరి పాల్గొన్నారు.





బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

కరువు ప్రాంతాలపై చిత్తశుద్ధి కరువు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - ఆలూరు

కరువు ప్రాంతాలపై ప్రభుత్వాలకు, పాలకులకు చిత్తశుద్ధి లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం సిపిఐ ఆలూరు నియోజకవర్గ 12వ మహాసభల సందర్భంగా వాసవీ కల్యాణ మండపం నుంచి అంబేద్కర్ సర్కిల్ చెక్‌పోస్ట్ మీదుగా బహిరంగసభ ఆవరణానికి ప్రదర్శన చేపట్టారు. బహిరంగ సభకు ఆలూరు, దేవనకొండ మండల కార్యదర్శులు రామాంజనేయులు, నరసరాం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రామకృష్ణ హాజరయి మాట్లాడారు. నియోజకవర్గంలో సాగు, తాగునీరు లేక, పరిశ్రమలు లేక ఉపాధి కోసం నిత్యం వలసలు వెళ్తున్నారని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను నిర్మించడంలో ప్రభుత్వాలకు, పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని చెప్పిన లోకేష్, ఇప్పుడు బిగించడంలో చెబుతున్నారని అన్నారు. స్థానిక సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు చేపట్టి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని తెలిపారు. లేకపోతే ప్రజలే ఓట్లతో బుద్ధి చెబుతారని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా నాయకులు శేఖర్, నబీ రసూల్, మద్దిలేటి శెట్టి, భూపేష్, విరుపాక్షి, నాగేంద్రయ్య, తిమ్మయ్య, కారన్న, మండల నాయకులు రాముడు, రంగన్న, కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

ప్రజాశక్తి - ఆదోని



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ హేమలత

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఈవ్ టీజింగ్ వంటి కార్యకలాపాలకు యువత పాల్పడరాదని ఆదోని డీఎస్పీ హేమలత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్తి టీం గురించి విధుల పట్ల విద్యార్థులకు సూచించారు. ప్రోగ్రాంలో భాగంగా శక్తి యాప్ ఉపయోగాలు, శక్తి యాప్ డౌన్‌లోడ్ గురించి తెలిపారు. మహిళల భద్రత గురించి చైల్డ్ మ్యారేజ్, ఈవ్ టీజింగ్ గురించి, సైబర్ క్రైమ్ గురించి 112, 181, 1098, 1930, 1972 నెంబర్లకు తెలపాలని అన్నారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తినా బాలికలు, మహిళలు ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. శక్తి టీం సభ్యులు రాజేశ్వరి, మల్లప్ప, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు ఉన్నారు.

గ్రామ కమిటీల ద్వారా బలోపేతం : వైసిపి



కన్వీనర్‌కు వివరాల అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామ కమిటీలను ఎంపిక చేసి మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని వైసిపి మండల కన్వీనర్ కెవి.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని వైసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పార్టీ గ్రామ కమిటీలను ఎంపిక చేసేందుకు సమావేశం నిర్వహించి చర్చించినట్లు తెలిపారు. వారం రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ గ్రామ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులతో పాటు సభ్యులను, గ్రామ కమిటీలను పూర్తిస్థాయిలో ఎంపిక చేయనున్నామని చెప్పారు. జిల్లా కార్యదర్శి ఉండే నవాజ్, బీసీ సెల్ నాయకులు మురళీ నాయుడు, దొరబాబు నాయుడు, మండల ఉపాధ్యక్షులు బిజిన్ రాజా, నాయకులు ఎస్‌బి.మన్సూర్, భాస్కర్ రెడ్డి, కాశిరెడ్డి, ఉరుకుంద రెడ్డి, కులుమాల శ్రీను, అగ్రహారం సర్పంచ్ రంగారెడ్డి, గంజిహళ్లి తోట రాముడు, పి.నడిమూల్ల పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

సిఎం సహాయ నిధి పేదలకు వరమని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి చేతుల మీదుగా సిఎం సహాయ నిధి కింద ఐదుగురు లబ్ధిదారులకు రూ.1,39,300 చెక్కు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు, వారి ఆరోగ్య పట్ల ప్రేమ చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఏ సమస్య వచ్చినా కులమతాలు, పార్టీలకతీతంగా తమను సంప్రదిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపుతామన్నారు.

బ్రిడ్జి నిర్మాణం జరిగేనా..?

- రైల్వే గేటుతో తప్పని నిరీక్షణ..!

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. అందుకు తగ్గట్లు సదుపాయాలు మాత్రం మెరుగుపడడం లేదు. ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. పట్టణంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వాహనాలు వాడే వారి సంఖ్య పెరిగింది. రోడ్ల వెడల్పు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది.

పట్టణంలో పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి శ్రీనివాస భవన్, పాత బస్టాండ్ వరకు రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోడ్డు వెంట వెళ్లాలంటే ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటూ ఇబ్బందులు పడాల్సిందే. మరో రోడ్డు లేకపోవడంతో క్రాంతి నగర్, లేబర్ కాలనీ, ఖానాపురం, నారాయణపురం, కల్లుబావి ప్రాంతాలకు వెళ్లేవారు డీఎస్పీ బంగ్లా మీదుగా రైల్వే గేటు రోడ్డు గుండా ప్రయాణం సాగిస్తున్నారు. ఆ రోడ్డు వెంట రాకపోకలు సాగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రైల్వే రాకపోకలు కూడా అధికమయ్యాయి. ఈ కారణంగా క్షణంలోనే గేటు వేస్తున్నారు. అక్కడ చాలామంది గేటు తీసే వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఎండకు, వర్షానికి కనీసం దాపు కూడా లేక ఇబ్బంది పడుతున్నారు. రైల్వే వంతెన పనులు మంజూరయ్యాయని అధికారులు ప్రకటించినా ఇంతవరకు కనీసం ఆనవాళ్లు కూడా కనపడకపోవడంతో వంతెన పనులు జరుగుతాయో లేదో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రైల్వే వంతెన పనులు ఎప్పుడో..?

పట్టణంలోని డీఎస్పీ బంగ్లా నుంచి రైల్వే గేటు మీదుగా బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రైల్వే అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్ ఉమాపతి ఇటీవల ప్రకటించారు. ఈఎస్ఐ ఆస్పత్రి, భాష్యం స్కూలు రోడ్డులో సర్వే పనులను కూడా పూర్తి చేశారు. ఏళ్ల తరబడి ఇక్కడే కాపురం చేస్తున్నామని, రోడ్డు విస్తర్ణంతో నష్టపోతున్నామని బాధితులు అధికారుల వద్ద వాపోయారు. అలైన్‌మెంట్ ఛేంజ్ చేసే అధికారం తమ పరిధిలో లేదని రైల్వే అధికారులు తేల్చి చెప్పారు. నష్టపరిహారం అందించాలనా కలెక్టర్ పరిధిలో ఉంటుందని నచ్చజెప్పారు.



గేటు వేయడంతో నిరీక్షిస్తున్న వాహనదారులు

వంతెన స్వరూపం

పట్టణంలో డీఎస్పీ బంగ్లా నుంచి 195 రైల్వే గేటు మీదుగా శంకర్ నగర్‌కు వెళ్లే రోడ్డు వరకు బ్రిడ్జి వెళ్తోందని, డిజైన్ సిద్ధమైందని రైల్వే అధికారులు చెబుతున్నారు. సుమారు రూ.60 కోట్లు ఖర్చు అవుతుందని, 870 మీటర్ల పొడవు వంతెన ఉంటుందని పేర్కొంటున్నారు. 30 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి, ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. సర్వే పూర్తయిందని, త్వరలోనే పనులు మొదలవుతాయని గతంలో తెలిపినా ఇంతవరకు అడుగులు ముందుకు పడడం లేదు. గతంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వేయాలని ప్రతిపాదన ఉన్నా సాయిల్ టెక్నికల్ సమస్య కారణంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి చేపట్టాల్సి వచ్చిందని ప్రకటన చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పట్టణంలో కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని, పట్టణ విస్తరణ జరిగి అక్కడ నివాసం ఉండే వారికి అనుకూలంగా ఉంటుందని అంటున్నారు.

పనులు మొదలు పెట్టాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి

ట్రాఫిక్ సమస్యతో సతమతమయ్యే వారికి వంతెన నిర్మాణం పూర్తయితే రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో కూడా నివాసాలు పెరిగాయి. రైల్వే వంతెన పూర్తయితే అక్కడి ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది. ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీకి వెళ్లే వారికి కూడా అనుకూలంగా ఉంటుంది. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా రైల్వే వంతెన నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా సజావుగా రాకపోకలు సాగించేందుకు చర్యలు చేపట్టాలి.



ఎస్ఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రశాంతంగా ముగిసిన మొహర్రం వేడుకలు

- ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరగడానికి, పోలీసు సిబ్బంది గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించడం వల్ల ఏ చిన్న సంఘటన జరగలేదని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం తిమ్మాపురం హేమంత్ ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామ పెద్దలు, ప్రజలు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ శ్రీనివాసులును పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించే లేదని చెప్పారు. మండల ప్రజలు ఎస్ఐ విధుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. తిమ్మాపురం ప్రజలు రామాంజనేయులు, గోపాల్, వలీ సాబ్, రామన్న పాల్గొన్నారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి

- చిరు వ్యాపారులు



మాట్లాడుతున్న బాధితులు

ప్రజాశక్తి - ఆదోని

ఆలూరు రోడ్డులోని తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద కాలువ పక్కన టీ, బంకులు, హోటళ్లు నిర్వహిస్తున్న వారికి ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని చిరు వ్యాపారులు కోరారు. శుక్రవారం ఆదోని మున్సిపల్ అధికారులు తిమ్మారెడ్డి బస్టాండ్ రోడ్డు పక్కన ఉన్న బంకులను తొలగించేందుకు జెసిబితో రావడం సరైంది కాదని అడ్డుకున్నారు. గతంలో రోడ్డు వెడల్పు చేసేటప్పుడు పైపు లైన్ వేసేటప్పుడు అధికారుల సూచన మేరకు రోడ్డుకు దూరంగా.. వెనుక భాగానికి బంకులను జరుపుకున్నట్లు తెలిపారు. అధికారులు ట్రాఫిక్ సమస్యను సాకుగా చూపుతూ బంకులను తొలగించేందుకు సిద్ధమవడం సరైంది కాదని సిపిఐ పట్టణ కార్యదర్శి వీరేష్ తెలిపారు.

బిఎల్ఒలకు శిక్షణ

ప్రజాశక్తి - హొళగుంద



ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల వ్యవస్థపై బిఎల్ఒలకు శిక్షణ ఇచ్చారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, తొలగింపులు వంటి వాటిపై, వచ్చే నెలలో జరిగే ఇంటింటి సర్వే, సర్వేలో అనుసరించే విధానం గురించి వివరించారు. శిక్షణ కర్త చందు నాయక్, ఈఆర్ఒ అజయ్ కుమార్, ఆలూరు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ దీప, ఇన్‌ఛార్జీ తహశీల్దార్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

ఆర్‌డిఎస్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్


- వైసిపి నాశనం చేస్తే.. కూటమి ముందు తీసుకెళ్తోంది

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

- సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆర్‌డిఎస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చిత్రపటాలకు ఎమ్మెల్యే బీవీ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014-19లో రాజోలి డైవర్షన్ స్కీమ్ (ఆర్‌డిఎస్) ప్రాజెక్టును నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.1,986 కోట్లతో మంజూరు చేస్తే, వైసిపి ప్రభుత్వం ఆ ప్రాజెక్టు రివర్స్ టెండరింగ్ పేరిట నాశనం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్‌డిఎస్, వేదవతి ప్రాజెక్టులను ముందుకు సాగించాలని అనుమతి ఇవ్వడంతో రాయలసీమ, ఎమ్మిగనూరు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొన్ని వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందుతుందని చెప్పారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, మండలాల కన్వీనర్లు ఖాసీం వలీ, కెటి.వెంకటేష్, తిరుపతయ్య నాయుడు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ, కార్యకర్తలు

శిథిలావస్థలో బ్రిడ్జి..!

- **భారీ వర్షం కురిస్తే కూలుతుందని భయపడుతున్న ప్రజలు**
- **బ్రిడ్జి కూలితే నాలుగు గ్రామాలకు రాకపోకలు బంద్**
- **మరమ్మతులు చేపట్టాలి : మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, ఎంపిటిసి ఎల్లంకి రజిని**

ప్రజాశక్తి - చిప్పగిరి



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జి

చిప్పగిరి దగ్గరలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. భారీ వర్షం కురిస్తే కూలుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. బ్రిడ్జి కూలితే మండలంలోని నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, ఎంపిటిసి ఎల్లంకి రజినీ కోరుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుమూల గ్రామాల రహదారులను నిర్లక్ష్యం చేస్తున్నాయి. చిప్పగిరి నుంచి ఏరూరు, దేగులపాడు, బంటనహాళ్, గుమ్మనూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో చిప్పగిరి దగ్గరలో బ్రిడ్జి ఉంది. ఎబిసి కాలువ నీరు వచ్చే సాగునీటికి కట్టిన ఈ బ్రిడ్జి మీదుగా బంటనహాళ్, గుమ్మనూరు, ఏరూరు, దేగులహాల్ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం వాహనాల్లో తిరుగుతూనే ఉంటారు. ఈ నాలుగు గ్రామాలకు చెందిన విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ఆర్‌టిసి బస్సు నడుపుతున్నారు. ఈ బస్సు కూడా ఈ బ్రిడ్జి మీదుగానే రోజూ వెళ్తోంది. కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ బ్రిడ్జి వైపు ఏ అధికారి కూడా తొంగిచూడలేదని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే తప్ప అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బ్రిడ్జి కింద ఉన్న రాతి కట్టడమంతా కింద పడిపోయి కేవలం నాలుగు వరసలు రాతి కట్టడం మాత్రమే మిగిలి ఉంది. భారీ వర్షం కురిసినా, లేదా ఎబిసి కాలువకు నీరు వదిలితే తప్పనిసరిగా కూలిపోతుందని, అప్పుడు ఈ నాలుగు గ్రామాలకు తిరిగేందుకు రహదారి కూడా లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం కావడం వల్ల చిన్న పని పడినా పట్టణమైన గుంటకల్లుకు పోవాల్సిందే. వెంటనే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ బ్రిడ్జి లేకపోతే పొలాలకు వెళ్లే చిప్పగిరి రైతులు కూడా నష్టపోవాల్సి వస్తుందని తెలుపుతున్నారు. ఈ బ్రిడ్జి సమస్యపై టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, సర్పంచి దాసరి గోవిందరాజులు, చిప్పగిరి ఎంపిటిసి ఎల్లంకి రజినిలు ప్రత్యేకాధికారి డాక్టర్ రంగనాథ్ బాబు, ఎంపిడిఒ అల్లా బకాష్ దృష్టికి తీసుకెళ్లారు.

ఉన్నతాధికారులతో మాట్లాడతాం

- ఎంపిడిఒ అల్లా బకాష్



నాలుగు గ్రామాలకు ఇబ్బందిగా మారిన చిప్పగిరి బ్రిడ్జిని నా కళ్లారా చూశాను. వెంటనే పనులు చేపట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులకు, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తాం. నిధులు కేటాయించి బ్రిడ్జి పునర్నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకునేలా కృషి చేస్తాం.

బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- సర్పంచి దాసరి గోవిందరాజులు



ఈ బ్రిడ్జి కూలిపోతే రహదారిలో ఉన్న రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుంది. నాలుగు గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించిపోతాయి. ప్రజలను, రైతులను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి బ్రిడ్జి పునర్నిర్మాణం చేపట్టాలి.

వైసిపి మండల యూత్ అధ్యక్షులుగా రాజు

ప్రజాశక్తి -దేవనకొండ



దేవనకొండ గ్రామానికి చెందిన బిల్డింగుల రాజును వైసిపి మండల యూత్ అధ్యక్షులుగా నియమించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు ఈ పదవి ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే విరుపాక్షి, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి లక్ష్మీదేవి, వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న సిఐ

కర్ణాటక మద్యం రవాణా నేరం

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక మద్యం రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని, అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న మద్యం, బైక్‌ను శుక్రవారం ఆదోని స్టేషన్‌లో మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌతాళం మండలం తిప్పలదొడ్డి క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించామని తెలిపారు. తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన చూడి సురేష్ పోలీసులను గమనించి ఒక ద్విచక్ర వాహనాన్ని, 10 బాక్సుల కర్ణాటక మద్యం వదిలేసి పారిపోయాడని చెప్పారు. ఆ వ్యక్తి మీద కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న మద్యం, బైక్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు. మద్యం విలువ సుమారు రూ.48 వేలు ఉంటుందని తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేపు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

- జడ్‌పిటిసి కిట్టు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మూగితాత దర్గా కమ్యూనిటీ భవనంలో ఈనెల 13న వైసిపి మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జడ్‌పిటిసి కిట్టు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు, మాజీ డైరెక్టర్లు, కో కన్వీనర్, ముఖ్యనాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం..!

- నాయకులకు కొమ్ముకాస్తున్న అధికారులు, పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి నందవరం

నందవరం గ్రామంలో అధికారుల నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నాయి. వాటిని పరిష్కరించండంటూ అధికారులను వేడుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. నాయకులు, వారి అనుకూల వ్యక్తులకు సమస్యలు లేకున్నా వారి మెప్పు కోసం పేదలను ఇబ్బందులకు గురి చేసి కొమ్ముకాస్తున్నారని విమర్శిస్తున్నారు. వారికి చిన్న సమస్య వచ్చినా హడావిడిగా వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు. పేదల సమస్యలు మాత్రం వారికి పట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



నీటి కోసం వీధి ప్రజల అవస్థలు

గ్రామంలో ఒకచోట కొన్ని నెలల క్రితం సిసి రోడ్డు వేశారు. అంతకు ముందున్న తాగునీటి పైపులైన్ తొలగించి రోడ్డు నిర్మించారు. ఇప్పటివరకు ఆ వీధి ప్రజలకు పైపులైన్ వేయలేదు. తాగడానికి నీరు లేక వీధి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారిని అడగగా... 'రోడ్డు వేసేంత వరకే మా బాధ్యత. అది నాకు సంబంధం లేదు' అంటూ చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారికి తెలుపగా ఆయన కూడా స్పందించడం లేదు. అలాగే కోట వీధిలో పరిస్థితి దుర్భరంగా తయారైంది. సమస్య వచ్చిన సందర్భాల్లో అధికారులు తూతూమంత్రంగా వస్తారు.. వెళ్తారు. కోట వీధిలో 20 ఏళ్లుగా పుష్కలంగా పారే కుళాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీరు రాక నిలిచిపోయింది. కొన్ని రోజుల క్రితం ఆ కుళాయికి సంబంధించిన పైపు లైన్‌కు వేరేచోట మరమ్మతులు చేశారు. మరమ్మతులయిన వెంటనే కుళాయికి నీరు నిలిచిపోయింది. సుమారు 18 కుటుంబాలకు నీటి ఎద్దడి నెలకొంది. వీధి ప్రజలు కుళాయికి నీరు రాకపోవడానికి కారణాలు అడిగితే అధికారులు 'వీధిలో వేరే చోట కుళాయి ఉంది కదా.. అక్కడకెళ్లి తెచ్చుకోవచ్చు కదా' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతూ ప్రజలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బందిని అడిగితే 'అందులో చెత్త పడి ఉంటుంది. మట్టి పడి ఉంటుంది' అని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. 'మీ కొరకు తవ్వితే మంచిగా ఉన్న సిసి రోడ్డు పాడవుతుంద'ని అంటున్నారు. మంచిగా నీరు పారే కుళాయిని అధికారులు, పంచాయతీ సిబ్బంది కలిసి వేరే వారి మెప్పు కోసం రాకుండా చేశారు. వీధిలో చాలామంది పంచాయతీ అనుమతి లేకుండా సొంత కుళాయిలను వేసుకున్నారు. 18 కుటుంబాలకు ఉన్న ఒకే ఒక్క కుళాయిని వారి నిర్లక్ష్యం వల్ల బంద్ చేశారు. ఇదెక్కడి న్యాయమని వీధి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకపోతే ఖాళీ బిందెలతో ర్యాలీగా వెళ్లి పంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత బాబుదే

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న మీనాక్షి నాయుడు

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అన్ని వర్గాల మన్ననలు పొందుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కార్వాన్‌పేటలో మాజీ కౌన్సిలర్ బాలాజీ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలుంటే సచివాలయం ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లాలని మీనాక్షి నాయుడు సూచించారు. నాయకులు రామస్వామి, అప్సర బాష, తిమ్మప్ప, శ్రీనివాస్ ఆచారి, రామకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్ ఉన్నారు. **దేవనకొండ** మండలం పి.కోటకొండ గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధిపై ప్రజలకు కరపత్రాలు అందజేశారు. మండలంలో అధ్వానంగా ఉన్న బేతపల్లి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. టిడిపి నాయకులు ఈదుల దేవరబండ సుభాన్, బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఆకుల వీరేష్, నీలకంఠం గౌడ్, పురుషోత్తం గౌడ్, వీరేష్, సిద్ధ, రుద్ర, మహేష్, సతీష్, సుధాకర్, వల్లే వెంకటేష్, ముని, కౌలుట్ల, రామలింగ, చిన్న రాముడు, వెంకటరెడ్డి, చాంద్ బాషా పాల్గొన్నారు. **హాలహర్విలో** 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వమించారు. టిడిపి మండల కన్వీనర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచి మల్లికార్జున, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జీ హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.



దేవనకొండలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వీరభద్ర గౌడ్



హాలహర్విలో పథకాలను వివరిస్తున్న నాయకులు

చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదు

- ఎస్ఐ రామస్వామి

ప్రజాశక్తి - ఆదోని

మైనర్లకు బైక్, కారు ఇవ్వరాదని, వారు నడిపే సమయంలో అనుకోని ఘటన జరిగితే సంబంధిత యజమానులపై కేసు నమోదు చేస్తామని ఆదోని త్రీ టౌన్ ఎస్ఐ రామస్వామి హెచ్చరించారు. శుక్రవారం ఆదోనిలోని నారాయణ పాఠశాలలలో ఎజిఎం రమేష్ కుమార్ అధ్యక్షతన ప్రిన్సిపల్ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు తెలియకపోవడంతో ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. చదువుతోపాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని, టైం మేనేజ్‌మెంట్ పాటించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు స్కూటర్లపై రాకూడదన్నారు. లైసెన్స్ ఉండదు.. ఏదైనా జరగరానిది జరిగితే పిల్లలు ఇబ్బందుల పాలవుతారని తెలిపారు. ప్రిన్సిపల్ లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ... పిల్లలకు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లా జోనల్ కోఆర్డినేటర్ శ్రీహరి రెడ్డి మాట్లాడుతూ... ప్రతి నారాయణ పాఠశాలలో నాలుగు గ్రూపులుగా విద్యార్థులను విడదీస్తూ వాళ్లలో గ్రూపునకు ఒక నాయకుని ఎన్నుకుని పాఠశాల క్రమశిక్షణ పాటించేలా చూసుకుంటారన్నారు. అనంతరం పాఠశాల ఎన్నికలలో గెలుపొందిన వారికి బ్యాడ్జీలను అందజేశారు. జోనల్ ఆర్ఎస్‌టి విభాగంలో పనిచేస్తున్న ప్రకాష్, రాయలసీమ హ్యాండ్ రైటింగ్ ఇన్‌ఛార్జీ సృజన్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామస్వామి



పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న నాయకులు

కష్టపడే వారికి గుర్తింపు

- వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది

ప్రజాశక్తి - ఆస్పరి

వైసిపిలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది, జిల్లా యూత్ వింగ్ కార్యదర్శి ప్రకాష్, ఎంపిటిసి రాధాకృష్ణ, సొసైటీ మాజీ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. శుక్రవారం వైసిపి అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన యూత్ వింగ్ మండల అధ్యక్షులు కాకా ప్రభాకర్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు పూల సంజిత్, వాలంటీరు వింగ్ అధ్యక్షులు కురువ శివ, డాక్టర్స్ వింగ్ తేవుల శ్రీనివాసులును స్థానిక గాంధీ పార్కు ఆవరణలో పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేస్తూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వైసిపి నాయకులు ప్రకాష్, సుదర్శన్, మహానంది, మల్లి, రంజిత్, మహీంద్రా, మణి పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన యువకులు

ప్రజాశక్తి - మంత్రాలయం




రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

స్థానిక వైసిపి యువకులు కొందరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆయనను కలుసుకొని టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, ఎంపిటిసి మేకల వెంకటేష్ ఆధ్వర్యంలో యువకులు లక్ష్మన్న, రాయచూరు రవి, సిద్ధు, గోవిందు, వీరభద్ర, రవి, వెంకటేష్, పులి టిడిపిలో చేరారు. బెస్త పవన్ కుమార్, రమేష్, మడ్రి శివ పాల్గొన్నారు.

ఖాసీం వలీకి సన్మానం

ప్రజాశక్తి - నందవరం



ఖాసీం వలీని సన్మానిస్తున్న సభ్యులు

టిడిపి మండల అధ్యక్షులుగా ఎన్నికైన ఖాసీం వలీని జామియా మసీద్ కమిటీ సభ్యులు సన్మానించారు. శుక్రవారం జామియా మసీదులో ముస్లిం పెద్దలు, యువకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఎంతో నమ్మకంతో ఖాసీం వలీని మండల అధ్యక్షులుగా ఎంపిక చేశారని తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కులమతాలకతీతంగా అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని కోరారు. అలాగే ముస్లింల సమస్యలను పరిష్కరిస్తూ, వారి అభివృద్ధి కృషి చేయాలని తెలిపారు. మసీద్ కమిటీ మౌలానా ఖాలిద్, అలీ అహ్మద్, టైలర్ వలీ, రెహ్మాన్ బాషా, ఆజి మాలన్ బాబా, వంటల రఫిక్, అబ్దుల్ రహీమాన్, హఫీజ్ పాల్గొన్నారు.